
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 29.0 ׀ కనిష్ఠం: 23.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 5 ఆగస్టు 2025



రావి, వేప చెట్లకు కల్యాణం
ఊరంతా సంబురం
- తలంబ్రాలు పోసుకున్న వృద్ధ దంపతులు
- జోగులాంబ గద్వాల జిల్లా చెన్నిపాడు గ్రామంలో వైభవంగా వేడుక

7

బీఆర్ఎస్‌లో.. అలజడి

గువ్వల బాలరాజు రాజీనామా నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల్లో చర్చ

- మరికొందరు ఆ బాటలోనే వెళ్తారనే ప్రచారం, వారి నుంచి ఖండన
- స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట తాజా పరిణామం ఎదురుదెబ్బే..
- బీజేపీలో పొత్తు లేదా విలీనంపై ఆడియో సంభాషణలో గువ్వల చర్చ
- కొత్త చేరికలతో బీజేపీ కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగే అవకాశం



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ.. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓవైపు కాళేశ్వరం కమిషన్ నివేదిక ఇవ్వడం, మరోవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిట్ విచారణ కొనసాగుతుండటం, కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత లేఖతో బీఆర్ఎస్ శ్రేణుల సహాయ నిరాకరణ. ఆరోపణలు, విమర్శలు, ఎదురుదాడులు.. కవిత జాగృతి ద్వారా సొంత కార్యాచరణతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేయడం మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా తయారైంది. అదే సమయంలో ఆయన బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండటంతో బీఆర్ఎస్‌లో అలజడి మొదలైంది. స్థానిక సంస్థల్లో గెలుపు కోసం బీఆర్ఎస్ కార్యాచరణను ప్రారంభించింది. నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి గెలుపుపై దిశానిర్దేశం చేయడంతో పాటు పార్టీ బలోపేతంపైనా చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో గువ్వల బాలరాజు రాజీనామాను పలువురు పార్టీకి ఎదురుదెబ్బగానే అభిప్రాయపడుతున్నారు. మాజీలు బలంగా ఉంటేనే కేడర్ బలంగా ఉంటుందని, ఈ నిర్ణయాలతో కేడర్‌లో నిరుత్సాహం వస్తుందని భావిస్తున్నారు. గువ్వలతో పాటే మర్రి జనార్దన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి కూడా బీజేపీలో చేరతారని ప్రచారం జరిగినప్పటికీ వారు ఈ ప్రచారాన్ని బలంగా ఖండించారు. మర్రి జనార్దన్‌రెడ్డి గువ్వలను ఆపేందుకు పార్టీ ప్రతినిధిగా చర్చలు జరిపానని మీడియాకు స్పష్టంగా తెలియజేశారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, కారు గుర్తుపైనే పోటీచేస్తానని ప్రకటించారు. అయితే మర్రి, బీరం చేరకపోయినప్పటికీ భవిష్యత్‌లో వేరే వ్యక్తులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తారనే ప్రచారం మాత్రం జరుగుతోంది.

కంచుకోటకు బీటలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో

(మిగతా 6లో.)

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

అచ్చంపేట (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు నర్సింహ (బంగారు రాజు), పదర మాజీ జడ్పీటీసీ రాంబాబు నాయక్‌లు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుకు ప్రధాన అనుచరుడిగా పార్టీలో పని చేశారు. మారుతున్న రాజకీయ సమీకరణలో భాగంగా వారు పార్టీ మారడంతో బీఆర్ఎస్ పార్టీకి గట్టి దెబ్బే తగిలినట్టు చెప్పుకుంటున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.



లబ్ధిదారుకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధిని మేం చేసి చూపిస్తున్నాం

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని తాము 18 నెలల కాలంలోనే చేసి చూపిస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఎంఎస్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో మండలానికి చెందిన వివిధ గ్రామాల లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసిడింగ్‌లు, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం మిత్తి కట్టుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. బీఆర్ఎస్ చిన్నచింతకుంటలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయలేదని, ఒక్క రేషన్ కార్డు, ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజీ, చిన్నచింతకుంటలో జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. పేదలకు రేషన్ కార్డు ఆత్మగౌరవం లాంటిదని, అలాంటి ముఖ్యమైన రేషన్ కార్డులను గత ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రేషన్ కార్డులు జారీ చేస్తున్నామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు. దేవరకద్ర నియోజకవర్గ వ్యాప్తంగా 3,625 ఇళ్లు మంజూరు చేశామని, అందులో 2,100 ఇళ్లు బేస్‌మెంట్ వరకు పూర్తయ్యాయని చెప్పారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరవింద్ కుమార్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రావణ్, అశోక్, మహమ్మద్ పాల్గొన్నారు.

హత్య కేసులో నేరస్థుడికి పదేళ్ల జైలు శిక్ష
- పదివేల జరిమానా
- నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

7

హ్యాండ్‌బాల్‌లో చిచ్చరపిడుగులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటుతున్న బాలికలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం.. కోచ్‌ల మెళకువలు

6

బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- ఎంపీ మల్లురవి వైఖరిపై ఆందోళన
- పెద్దకొత్తపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు, కుల సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో
- దండు నరసింహకు క్షమాపణ చెప్పకుంటే మండలంలో తిరగనివ్వం

6

ఇక పాఠశాలల్లోనే ఆధార్ నమోదు
- నారాయణపేట జిల్లాలో 13 మంది ఆపరేటర్లతో ప్రక్రియ
- జిల్లాలో ఆధార్ కార్డులు లేని విద్యార్థుల సంఖ్య 7,075



మద్దూర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రం



నారాయణపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పాఠశాలల్లోనే ఆధార్ కార్డు నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. కొత్తగా కార్డుల కోసం ఐరిష్ ద్వారా ఫొటోలు తీయడంతో పాటు కార్డులు అప్‌డేట్ చేస్తున్నారు. జిల్లాలో ఆధార్‌కార్డులు లేని విద్యార్థులు 7,075 మందిని గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాలు ఉండగా దామరగిద్ద, ధన్వాడ, క్రిష్ణ, నర్వ మండలాలు మినహా మిగతా 9 మండలాలకు 13 మంది ఆపరేటర్లను నియమించారు.

ఎంఈవోలు సూచించిన పాఠశాలలకు వెళ్లి..

ఆధార్ కార్డు గుర్తింపు కోసమే కాకుండా ప్రభుత్వ పథకాల అమలు, ధ్రువపత్రాల జారీకి ప్రామాణికంగా తీసుకుంటున్నారు. జిల్లాలో వేల మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో అపార్ సంఖ్య కేటాయించడం కుదరడం లేదు. ఉన్నత చదువులకు గుర్తింపుగా పనికొచ్చే అపార్ సంఖ్యను బట్టే పాఠశాలలకు నిధులు కేటాయించనున్నారు. దాంతో ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. మండల విద్యాశాఖ అధికారులు సూచించిన విధంగా ఆపరేటర్లు పాఠశాలలకు వెళ్లి ఆధార్ నమోదు చేపడుతున్నారు.

పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేని వారికీ

జిల్లాలోని గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంత నిరుపేదలు ముంబాయి, పూణె, హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. వారి పిల్లలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీల పిల్లలకు పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేక ఆధార్ నమోదుకు దూరం అవుతున్నారు. వారందరికీ పాఠశాలల్లో ఆధార్‌కార్డులు జారీ చేయనున్నారు. ఇదివరకు సర్వశిక్షా అభియాన్ కింద మండల ఎమ్మార్సీ భవనాల్లో 0 నుంచి 15 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ రెండేళ్లుగా నిర్వహించారు. ఇటీవల ఎమ్మార్సీల్లో ఉన్న ఆధార్ కార్డుల జారీ కేంద్రాలను ఎత్తేశారు.

అవసరమైన చోట కేంద్రాలు



విద్యార్థులకు ఆధార్‌కార్డులు లేని పాఠశాలలకు ఆపరేటర్లు వెళ్లి, కార్డుల జారీ కోసం ఐరిష్‌తో ఫొటోలు తీస్తున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో గోవిందరాజులు పర్యవేక్షణలో మండల విద్యాధికారి అనుమతితో అవసరమైన చోట ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాస్, జిల్లా సెక్టోరియల్ అధికారి, నారాయణపేట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

వనమహోత్సవం లక్ష్యాలు సాధించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటే లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ విజయేందిరబోయి చెప్పారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వన మహోత్సవంతో పాటు వివిధ అంశాలపై సమీక్ష చేశారు. జిల్లాలో 58 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 63 శాతం మొక్కలు నాటి, రాష్ట్రంలో 12వ స్థానంలో ఉందని చెప్పారు. శాఖల వారీగా మొక్కల లక్ష్యం, సాధించిన ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, జడ్చర్ల, భూత్పూర్ మునిసిపాలిటీలలో మొక్కలు నాటడంలో ఆశించిన ప్రగతి లేదని తెలిపారు. కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీలలో లక్ష్యం వేగంగా పూర్తి చేయాలన్నారు. కావలసిన మొక్కల ఇండెంట్ ఇస్తే డీఆర్‌డీవో నుంచి సరఫరా చేస్తారని తెలిపారు. పాఠశాలలు, గురుకులాలు, కళాశాలల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. అందుకు ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. 40 వేల ఈత మొక్కలు ఉన్నాయని, ఎక్సైజ్ శాఖ వాటిని నాటించాలని అన్నారు అటవీశాఖ నర్సరీలో అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలు రైతుల నుంచి ఇండెంట్ ఇస్తే సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మొక్కలు చనిపోయిన చోట కొత్త మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి, అవి వృక్షాలుగా పెరిగేలా బతికించాలన్నారు. నాటిన మొక్కల వివరాలు టీసీఎఫ్ఐఎస్ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేసి, అప్‌డేట్ చేయాలని ఆయా శాఖలను కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎఫ్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.



ధన్వాడ కస్తూర్బాలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అలసత్వం వహిస్తే సహించేది లేదు
- కస్తూర్బా తనిఖీలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధన్వాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల అలసత్వం ఎందుకని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం ఆమె ధన్వాడ కస్తూర్బా గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలతో పాటు, మధ్యాహ్న భోజన వివరాల గురించి ఎస్‌వో గంగమ్మను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై ఆరా తీసిన అనంతరం ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో నిర్మిస్తున్న రెజ్లింగ్ షెడ్‌ను పరిశీలించి నిర్మాణ పరిస్థితిపై కోచ్ శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. కేంద్రంలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, ఓపీపై వైద్యాధికారితో మాట్లాడారు. ఆసుపత్రిలో గదులను పరిశీలించి, కేంద్రం పరిధిలో ఉపకేంద్రాల గురించి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ నర్సుకు మెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పేదలకు వైద్య సేవలను అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. హరితహారం కొనసాగింపుపై ఆరా తీసి ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటాలని ఎంపీడీవోకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో గోవిందరాజులు, తహసీల్దార్ సింధూజ, ఎంఈవో గాయత్రి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డిలు ఉన్నారు.



జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలతో కాలుష్యం బారిన పడిన పంటపొలాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఫార్మా కాలుష్యం
- పంట పొలాల్లోకి వ్యర్థ జలాలు
- సాగుకు పనికిరాని పొలాలు
- తనిఖీలకు అనుమతించని యాజమాన్యాలు

7

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి
- ఎస్పీ యోగేష్‌గౌతమ్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ యోగేష్‌గౌతమ్ సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 14 ఫిర్యాదులను స్వీకరించి చట్ట ప్రకారం పరిశీలించాలని సీఐ, ఎస్ఐలతో ఫోన్‌లో మాట్లాడి సూచించారు. భూతగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు.

బీఆర్ఎస్‌లో అలజడి

(5వ పేజీ తరువాయి)

2009లో కేసీఆర్ పోటీచేసి గెలిచిన నాటి నుంచి బీఆర్ఎస్ కేడర్ బలం పుంజుకోవడం ప్రారంభమైంది. 2014 ఎన్నికల్లో మొత్తం 14 స్థానాల్లో కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, దేవరకద్ర స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. ఆ తర్వాత టీడీపీ గెలిచిన నారాయణపేట, కాంగ్రెస్ గెలిచిన మక్తల్ శాసనసభ్యులు కూడా బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. 2018 ఎన్నికల్లో మొత్తం 14 స్థానాల్లో కొల్లాపూర్ మినహా 13 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకున్నది. తర్వాత కొల్లాపూర్ నుంచి కాంగ్రెస్ తరపున గెలిచిన బీరం బీఆర్ఎస్‌లో చేరడంతో క్లీన్‌స్వీప్ అయ్యింది. అయితే 2023 ఎన్నికల్లో మొత్తం 14 స్థానాల్లో గద్వాల, అలంపూర్ స్థానాలను తిరిగి కైవసం చేసుకోగా 12 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు పార్లమెంట్ స్థానాల్లో మూడో స్థానానికి పరిమితమైంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ కేడర్ అలాగే నిలిచి ఉన్నది. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇంకా పార్టీలోనే కొనసాగుతుండటంతో పార్టీ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలవడం కూడా గ్రామాల్లో పార్టీ బలాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు. అయితే కంచుకోటగా మారిన పాలమూరు జిల్లాలో ఈ రాజీనామాల పర్వం, మరికొందరి రాజీనామాల ప్రచారం కేడర్‌ను కుంగదీసే అవకాశం ఉంది.

ఆడియో లీక్‌తో పొత్తు లేదా విలీనంపై చర్చ

రాజీనామా చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తన అనుచరుడు ఒకరితో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. అందులో ప్రధానంగా బీజేపీతో పొత్తు లేదా విలీనంపై చర్చ జరిగింది. పార్టీలో సీనియర్ లీడర్‌గా ఉండి రెండుసార్లు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గువ్వల బాలరాజుకు బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు లేదా విలీనంపై కచ్చితమైన సమాచారం ఉండటం వల్లే తన అనుచరుడితో ఆ మేరకు చర్చ చేశారనే ప్రచారం జరుగుతోంది. స్థానికంగా ఉన్న ప్రాధాన్యాలు, మాజీ ఎంపీ రాములు, గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసిన తన తనయుడు భరత్ అదే పార్టీలో ఉండటం, ఒకవేళ విలీనం, పొత్తు వస్తే తన అభ్యర్థిత్వం గల్లంతవుతుందనే నేపథ్యంలోనే ముందస్తుగా బాలరాజు ఈ నిర్ణయం తీసుకున్నారనే భావన వ్యక్తమవుతోంది. ఇటీవల బీజేపీలో విలీనంపై రాష్ట్రస్థాయిలో ఒక దుమారం రేగింది. తాజాగా గువ్వల వ్యాఖ్యలు అందుకు బలం చేకూరుస్తాయని చెప్పవచ్చు. అయితే రాజీనామాలతో బీఆర్ఎస్‌లో అలజడి నెలకొనగా బీజేపీలో మాత్రం ఉత్సాహం పెరగడానికి అవకాశం ఉంది. ఇప్పటికే ఆ పార్టీ ఎన్నడూ లేనంతగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు చేస్తోంది. కొత్త అధ్యక్షుడి నియామకం పూర్తయి పాలమూరులో కూడా పర్యటించారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే చేరిక, త్వరలో మరికొందరి చేరిక ప్రచారం కచ్చితంగా బీజేపీకి కలిసి వచ్చే అంశాలుగా చెప్పవచ్చు.

రాష్ట్ర అవార్డుకు చేనేత కార్మికుల ఎంపిక


దేవరకొండ లచ్చన్న


మహంకాళి సులోచన

అమరచింత, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు అమరచింతకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ పద్మశాలి సంఘం నాయకుడు, నేత కార్మికుడు దేవరకొండ లచ్చన్న, మహంకాళి సులోచనమ్మలను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ చేనేత కార్మికులుగా గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు ఇవ్వనున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ ఇద్దరు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సన్మానించి అవార్డుతో పాటు రూ. 25వేల చెక్కును అందించనున్నది. రాష్ట్రస్థా యి అవార్డుకు ఎంపికైన 65 ఏళ్లు పైబడిన కార్మికులకు ప్రతీ నెల రూ.8వేల పించన్ ఇవ్వనున్నారు. అమరచింతకు చెందిన ఇద్దరు కార్మి కులు, ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి గ్రామానికి చెందిన ఒక రు, కొత్తకోటకు చెందిన ఒకరితో కలిపి వనపర్తి జిల్లాలో నలుగురు అవార్డులకు ఎంపికైనట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ


హైదరాబాద్‌లో సిట్ ముందు హాజరై వస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) ముందు విచారణకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అచ్చంపేట నియోజకవర్గంలో ప్రతిపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్‌లకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యేను విచారించారు. సిట్ బృందం అడిగిన సమాచారాన్ని వారికి అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మార్కెట్లోకి కొత్తగా "రెనాల్ట్ ట్రైబర్" కారు



మార్కెట్లోకి కొత్తగా "రెనాల్ట్ ట్రైబర్"కారు ను విడుదల చేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్, ఎండీ గట్టు గోపాల్‌రెడ్డి

పాలమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మార్కెట్లోకి యుక్త మోటార్స్ షోరూం ఆధ్వర్యంలో కొత్తగా "రెనాల్ట్ ట్రైబర్"కారును ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్, ట్రెండ్ గ్రూప్ ఛైర్మన్ గట్టు గోపాల్‌రెడ్డితో కలిసి సోమవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ "రెనాల్ట్ ట్రైబర్"కారు సరికొత్త 21 స్టాండర్డ్ ఫీచర్స్‌తో 6 ఎయిర్ బ్యాగ్స్ క్రూజ్ కంట్రోల్ సిస్టమ్, 182సెంటీమీటర్స్ గ్రౌండ్ క్లియరెన్స్ 5నుంచి 7సీట్లు, 625 లీటర్ల బూట్ స్పేస్, 38.1 సెంటీమీటర్ల లాండ్ స్పేస్ ఫ్లెక్స్ వీల్స్, 20.32సెంటీమీటర్ల టచ్‌స్క్రీన్ వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్, ఎల్ఈడీ టెక్నాలజీ హెడ్‌లైట్స్ కలిగి ఉంటుందన్నారు. మూడు రంగుల్లో పెట్రోల్ వర్షన్‌లో లభించే ఈ కారు 19కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందన్నారు. ఎక్స్ షోరూం ధర రూ. 8,64,999 ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ గట్టు సిరిచందనరెడ్డి, కరూర్ వైశ్యబ్యాంక్ మేనేజర్ మాధూరి, సిబ్బంది, ఆనంద్, శ్రీశైలం, సందీప్, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో చిచ్చరపిడుగులు

- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటుతూ..
- రాణిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారిణులు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం.. కోచ్‌ల మెళకువలు


మహబూబ్‌నగర్‌లో ఎస్‌జీఎఫ్-17 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ విజేతగా నిలిచిన బాలికల జట్టులో కప్‌తో జిల్లా క్రీడాకారిణి పారిజాత(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చదువులోనే కాదు ఆటల్లోనూ సత్తా చాటుతూ ముందుకు దూసుకుపోతున్నారు ఆ బాలికలు. కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల సహకారంతో ఎంతో మంది వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఫాస్టెస్ట్ క్రీడగా గుర్తింపు పొందిన హ్యాండ్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ క్రీడాకారిణులు మెరుపులు మెరిపిస్తున్నారు.

ఈ ఏడాది ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో జరిగిన జాతీయ స్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టు ప్రీ క్వార్టర్స్‌కు వెళ్లింది. జిల్లాకు చెందిన బాలికలు చక్కటి ప్రతిభ జట్టును ప్రీ క్వార్టర్స్ చేరేందుకు కీలకపాత్ర పోషించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయికి ఎదిగారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల మెళకువలు, సూచనలు పాటిస్తూ హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్నారు. జాతీయ స్థాయి టోర్నీల్లో రాణిస్తున్న క్రీడాకారిణులపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

మొదటిసారి..



మహబూబ్‌నగర్‌కు చెందిన మాధురి హ్యాండ్‌బాల్‌లో రాణిస్తోంది. రెయిన్‌బో స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నది. రెండేళ్లుగా కోచ్ ప్రదీప్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ హ్యాండ్‌బాల్ జట్టులో రైట్ వింగ్ స్థానంలో ఆడుతున్నది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కనబరుస్తోంది. 4 సార్లు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన టోర్నీల్లో పాల్గొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్తరప్రదేశ్ జాతీయ స్థాయి టోర్నీలో సత్తా చాటింది. భవిష్యత్తులో భారత జట్టుకు ఆడడం, ఐఏఎస్ కావాలన్నదే తన ధ్యేయమని మాధురి పేర్కొంది.

మూడు జాతీయ స్థాయి టోర్నీల్లో...



జిల్లా కేంద్రానికి చెందిన జి. వర్ష మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. పీఈటీ జీయావుద్దీన్ ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నది. కోచ్ ప్రదీప్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ చాటుతోంది. 8 సార్లు రాష్ట్ర, ఢిల్లీ, పంజాబ్, కర్నాటకలో జరిగిన మూడు జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొని సత్తా చాటింది. భవిష్యత్తులో ఇండియాకు ఆడాలన్నదే తన లక్ష్యం అంటున్నది.

రెండు సార్లు జాతీయ స్థాయికి..



మహబూబ్‌నగర్‌కు చెందిన పారిజాత 10వ తరగతి జిల్లా కేంద్రంలోని లిటిల్‌స్కాలర్ స్కూల్‌లో చదువుతోంది. క్రీడాకారుడైన తండ్రి ప్రేమ్‌నగర్‌కు చెందిన బాలరాజు ప్రోత్సాహంతో హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తోంది. కోచ్ జీయావుద్దీన్ పర్యవేక్షణలో సాధన చేస్తున్నది. 6సార్లు రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటింది. 2023లో ముంబయిలో నిర్వహించిన జాతీయస్థాయి సబ్‌జూనియర్, 2025 జనవరిలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్-17 హ్యాండ్‌బాల్ టోర్నీలో సత్తాచాటింది. భారత జట్టుకు ఆడాల్నదే లక్ష్యమని చెబుతోంది పారిజాత.

3సార్లు రాష్ట్ర, ఒకసారి జాతీయ స్థాయి...



మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీవర్ధిని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. ఇటు చదువుతో పాటు తనకు నచ్చిన హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నది. జట్టులో అటాకర్ స్థానంలో ఆడుతోంది. కోస్గిలో నిర్వహించిన అండర్-17 ఎస్‌జీఎఫ్ టోర్నీలో జట్టు చాంపియన్‌గా నిలవడంలో తన వంతు పాత్ర పోషించింది. 3 రాష్ట్ర, 1 జాతీయ స్థాయిలో ఆడి సత్తా చాటింది. అంతర్జాతీయ స్థాయికి ఆడాలన్నదే లక్ష్యం.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- ● ఎంపీ మల్లురవి వైఖరిపై ఆందోళన
- కాంగ్రెస్ శ్రేణులు, కుల సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో


మల్లురవి వైఖరికి నిరసనగా పెద్దకొత్తపల్లిలో రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవి వైఖరికి నిరసనగా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈనెల 2న కొల్లాపూర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహిరంగ సభలో పెద్దకొత్తపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహను స్టేజీ మీద అగౌరవపర్చిన ఎంపీ బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే మండలంలో తిరగనివ్వమని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, కుల సంఘాల నాయకులు సోమవారం మండల కేంద్రంలో 167హైవేపై గంటన్నరపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారి పొడవునా కిలో మీటరు మేరకు వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. స్థానికేతరుడైన ఎంపీ మల్లు రవి గో బ్యాక్ అంటూ ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, డబ్బా ఎల్లయ్య, నాగరాజు మాట్లాడారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సతీష్ చేరుకుని ఆందోళనను విర మించాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. చేసేదేమిలేక పోలీసులు బలవంతంగా ఆందోళనకారులను తోసివేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కుల సంఘాల నాయకులు ర్యాలీగా పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి తిరిగి బస్టాండ్ చౌరస్తాకు చేరుకున్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు ధర్మేందర్, బద్యా నాయక్, శశికళ, శివశంకర్, మాదాసి కురువ సంఘం మండల అధ్యక్షుడు బెట్టరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొల్లె ఈశ్వర్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బ్యాగరీ మల్లేష్, రామస్వామి, మత్స్య కార్మిక సంఘం మండల అధ్యక్షుడు డబ్బా ఎల్లయ్య, మాజీ వార్డు సభ్యులు మహేష్, రవినాయక్, శ్రీరాములు, ఆరేపల్లి శ్రీను, శారద, బీరయ్య, మాసన్న, సాయి, శివ పాల్గొన్నారు.

మాయావతిని ప్రధాని చేయడమే లక్ష్యంగా పని చేయాలి

- బీఎస్పీ యూపీ మాజీ ఎమ్మెల్యే అతార్‌సింగ్‌రావ్
- నాగర్‌కర్నూల్‌లో బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న యూపీ మాజీ ఎమ్మెల్యే అతార్‌సింగ్‌రావ్

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ అధినేత్రి మాయావతిని దేశానికి ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని బీఎస్పీ జాతీయ నాయకుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే అతార్‌సింగ్‌రావ్ పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో బీఎస్పీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయనతో పాటు ఆ పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ దాగిళ్ల దయానంద్‌రావ్, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభా కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతారాసింగ్‌రావ్ మాట్లాడుతూ నూటికి85 శాతం బహుజనులు ఉన్న ఏకైక పార్టీ బీఎస్పీ అని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ పాలనతో ప్రజలు విసుగు చెందారని, రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించి మాయావతిని ఐదోసారి యూపీ ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సెంట్రల్ కోఆర్డినేటర్ దయానంద్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ ఇతర పార్టీలకు బలమైన పోటీ ఇవ్వాలన్నారు. బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, రాష్ట్ర కోశాధికారి ప్రణయ్, ఈసీ సభ్యుడు పృథ్వీరా జ్, జిల్లా ఇన్‌చార్జి బీసమోళ్ల యోసేఫ్, నాయ కులు అనిల్, కళ్యాణ్, రామన్న, దాస్, కృపా నందం, నాగేష్, కురుమయ్య, పరశురాం, రాంచందర్, బాలు, భాస్కర్, నాగరాజు, బాలనాగులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- రాష్ట్ర విద్యాశాఖ జేడీ వెంకటనర్సమ్మ


రాజాపూర్ కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ, సీఆర్టీలతో మాట్లాడుతున్న వెంకట నర్సమ్మ

రాజాపూర్/బాలానగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజాపూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు, కేజీబీవీ పాఠశాలలను సోమవారం రాష్ట్ర విద్యాశాఖ జేడీ వెంకటనర్సమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారని విద్యార్థులతో, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. రాజాపూర్ ఎంఈవో సుధాకర్, జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● బాలానగర్ మండలంలో గురుకుల పాఠశాలను వెంకటనర్సమ్మ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో ఆమె మాట్లాడి గురుకులంలో బోధన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె గురకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్ రెడ్డితో మెనూను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రదర్శించిన రైఫిల్ షూటింగ్‌ను తిలకించారు.

భగీరథ యత్నం

- 1008 బిందెలతో శివయ్యకు జలాభిషేకం
- ఇటిక్యాలపాడులో వరుణుడి కోసం రైతుల ప్రత్యేక పూజలు


మేళతాళాల మధ్య అభిషేకం కోసం బిందెలతో నీటిని తెస్తున్న రైతు సంఘం సభ్యులు, గ్రామస్థులు

అలంపూరు చౌరస్తా/ ఉండవల్లి/ మానవపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వర్షం కోసం రైతులు భగీరథ యత్నానికి దిగారు. వ్యవసాయ పనులు మానేసి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. తాజాగా ఉండవల్లి మండలం, ఇటిక్యాలపాడు గ్రామంలో వర్షం కోసం ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామంలో రైతులంతా కలిసి బిందెలతో 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానదికి పాదయాత్రగా వెళ్లి పవిత్ర స్నానాలు ఆచరించి శుద్ధ జలాలను తీసుకొచ్చి ప్రత్యేకంగా అభిషేకించారు. గ్రామంలో ప్రజలంతా అభిషేకం చేయడంతో ఆ శివయ్య నీటిలో మునిగిపోయాడు. అనంతరం మారమునగాల శివారులో ఉన్న రాములవారిని, ఖానాపురం శివారులో ఉన్న ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లపై తీసుకొచ్చి పూజలు చేశారు. ఇలా చేస్తే వరుణుడు కరుణిస్తాడని నమ్ముతారు. గత 50 రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్నామని రైతులు తెలిపారు.

1001 బిందెల శుద్ధ జలంతో..

వర్షం కోసం ఉండవల్లి మండల కేంద్రంలోని పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు, గ్రామస్థులతో కలిసి కృష్ణ, తుంగభద్ర నదుల నుంచి తెప్పించిన 1001 బిందెల జలంతో స్వామివారికి జలాభిషేం చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అంతకుముఎందు గ్రామంలోని పలువురు మహిళలు పూజా సామగ్రితో ఆలయ ప్రాంగాణానికి ఊరిగింపుగా వచ్చారు. రైతు సంఘం సభ్యులు రామకోటి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రమేష్, వెంకటేశ్వర్ రెడ్డిపాల్గొన్నారు.

వర్షం కురవాలని..

వర్షం కురిస్తే పంటలకు జీవం పోసినట్లు ఉంటుందని సోమవారం మానవపాడు మండల పరిధిలోని చందూరు గ్రామ శివాలయంలోని శివలింగానికి కృష్ణానది నీటితో జలాభిషేకం చేశారు.

కాడెద్దులతో గ్రామ శివారులోని నది వద్దకు వెళ్లి నీటిని తీసుకువచ్చి గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ


బంగారు పతకంతో బసంత్



బంగారు పతకంతో జనార్ధన్

మక్తల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా హన్మకొండలో జరుగుతున్న 11వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన క్రీడాకారులు బసంత్, జనార్ధన్‌లు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ జగదీష్ తెలిపారు. 600ల మీటర్ల పరుగుపందెంలో బసంత్ 1.25 నిమిషాల్లో పరుగెత్తి బంగారు పతకం సాధించారన్నారు. అలాగే ట్రిబుల్‌జంప్ విభాగంలో జనార్ధన్ బ్రౌంజ్ మెడల్, హై జంప్‌లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. త్వరలో జరుగు చాంపియషన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

2లీగ్ టోర్నీలో చెలరేగిన జిల్లా క్రీడాకారులు

- 5 వికెట్లు తీసిన జశ్వంత్ - 4 వికెట్లతో రాణించిన ముఖీద్
- 195 పరుగులకు హైదరాబాద్ ఆలౌట్


5 వికెట్లు తీసిన జశ్వంత్


4 వికెట్లు తీసిన ముఖీద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2లీగ్ టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారులు రాణించారు. సోమవారం హైదరాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల న్యూ మెడిస్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 2డే క్రికెట్ లీగ్‌లో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ బ్లూస్ జట్టు 56.1 ఓవర్లలో 195 పరుగులకే కుప్పకూలింది. జట్టులో హర్షిత్‌రెడ్డి అర్ధసెంచరీ(59) సాధించాడు. జిల్లా బౌలర్లలో జశ్వంత్ 5, ముఖీద్ 4 వికెట్లు తీసి చెలరేగారు. జశ్వంత్, ముఖీద్‌ను జిల్లా క్రీడాకారులు, జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ ఎం. రాజశేఖర్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో అందుకున్న పతకాలతో జిల్లా క్రీడాకారుల బృందం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న సౌత్ జోన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాల పంట పండించారు. సోమవారం జరిగిన అండర్-18 బాలుర విభాగం హై జంప్‌లో ఉదయ్‌కిరణ్ సిల్వర్ మెడల్ సాధించాడు. అదేవిధంగా అండర్-20 బాలుర విభాగంలో కాట్రావత్ శ్రీను 800 మీటర్లలో గోల్డ్ మెడల్, 1500 మీటర్లలో సిల్వర్ మెడల్ సాధించాడు. అండర్- 20 బాలుర విభాగానికి సంబంధించి హై జంప్‌లో నవీన్‌కుమార్ బ్రౌంజ్ మెడల్ సాధించాడు. అండర్- 20 బాలికల విభాగం రన్నింగ్‌లో కొడావత్ స్వప్న 1500 మీటర్లలో గోల్డ్ మెడల్, 3000 మీటర్ల స్టిపుల్ చేజ్ గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే పి.చైతన్య 5000మీటర్లు, 10000 మీటర్లు రన్నింగ్‌లో 2 సిల్వర్ మెడల్స్ సాధించగా, జి.రాజేశ్వరి 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ గోల్డ్ మెడల్ సాధించింది. ఇక అండర్-20 బాలికల విభాగం డిస్కస్ త్రోలో రేవతి సిల్వర్ మెడల్ సాధించింది. జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం పట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, ఉపాధ్యక్షులు లావణ్యరెడ్డి, లక్ష్మీ, బిక్షపతి, కోశాధికారి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు పరశురాం, అంజయ్య, కొర్ర రాములు, సభ్యులు శివకుమార్, శ్రీకాంత్, శేఖర్, హైమావతి, విష్ణు హర్ష వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

బల్మూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వారం రోజుల క్రితం నమోదైన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాజేందర్ కేసు వివరాలను వెల్లడించారు. గత నెల 27న మైలారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన కటికర్ల ఆంజనేయులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. తులం బంగారం గొలుసుతో పాటు, 20 తులాల వెండి గొలుసులు, రూ. 30 వేలు ఎత్తుకెళ్లాడు. సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వారం రోజుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు ఆంజనేయులును సోమవారం అరెస్టు చేసి సొమ్మును రికవరీ చేశారు. నిందితుడిని అచ్చంపేట కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసును ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు ప్రవీణ్, భీముడు, ఆంజనేయులును ఎస్ఐ అభినందించారు.

క్రైం కార్నర్

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య


బత్తుల శ్రీశైలం (ఫైల్)

బిజినేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా.. బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన బత్తుల శ్రీశైలం (50) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి అతడు మద్యం తాగేందుకు భార్య లక్ష్మిని డబ్బులు అడుగగా, ఆమె ఇవ్వలేదు. దీంతో అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని మదిరెడ్డి బాల్‌రెడ్డి పొలం కంచె కడీకి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న అతడిని స్థానికులు గమనించారు. కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై అతడి తమ్ముడి లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కడుపు నొప్పి భరించలేక..

ఖిల్లాఘణపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని మామిడిమాడలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మెదమోని రవికి, మానాజీపేట గ్రామానికి చెందిన ఉప్పరపల్లి రూప (25)కు 7 సంవత్సరాల క్రితం వివాహమైంది. రెండు సంవత్సరాలుగా రూప తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. ఆదివారం మధ్యాహ్నం కడుపులో తీవ్రమైన నొప్పి వస్తోందని ఆమె భర్త రవికి తెలిపింది. పొలానికి వెళ్లి వచ్చాక ఆసుపత్రికి తీసుకువెళ్తానని చెప్పి అతడు వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి రూప ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై ఆమె తల్లి మంజుల సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

సంతానం కలుగలేదని..


పుల్లన్న (ఫైల్)

ఇటిక్యాల ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సంతానం కలుగకపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలంలోని షాబాద్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ కె.రవినాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుల్లన్న(40)కు వివాహమై 20 ఏళ్లు కావస్తున్నా సంతానం కలుగలేదు. దీనికి తోడు వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఆది వారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. భార్య జయమ్మ గమనించి కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. సంఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వలలో చిక్కుకొని వ్యక్తి మృతి


రామస్వామి (ఫైల్)

తాడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీటి కుంటలో వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని గోవిందాయపల్లి గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రామస్వామి (34) చేపలు పట్టేందుకు ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని కుంటకు వెళ్లాడు. దుస్తులు, చెప్పులు కుంట ఒడ్డున పెట్టి వలతో నీటిలోకి దిగాడు. చేపలు పడుతుండగా వల కాళ్లకు చుట్టుకుని నీటిలో మునిగిపోయాడు. రాత్రి ఆయన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం తెల్లవారుజామున కుంట వద్దకు వెళ్లి చూడగా, అతడి చెప్పులు, దుస్తులు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ గురుస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని, అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. వారు బోటు సాయంతో కుంటలో గాలించగా రామస్వామి మృతదేహం లభ్యం కావడంతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దు

గట్టు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ ఎద్దు చనిపోయింది. గ్రామానికి చెందిన రైతు సందయ్య సోమవారం ఉదయం ఎద్దులను తీసుకొని పొలానికి వెళ్లాడు. పొలం పనులు పూర్తయ్యాక వాటిని మేతకు వదిలాడు. ఓ ఎద్దు మేస్తూ, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా, విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయింది. దాని విలువ రూ. 80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. అదుపు తప్పిన పాఠశాల బస్సు

- బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు
- స్టేజీపైనే బస్సును ఆపేసిన గోనుపాడు గ్రామస్థులు

గద్వాల సర్కిల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం తో ఓ పాఠశాల బస్సు అదుపు తప్పింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో బస్సులో ఉన్న సుమారు 50 మంది విద్యార్థులకు ప్రాణాపాయం తప్పింది. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. గద్వాల శివారులోని నోబుల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను సోమవారం సాయంత్రం పాఠశాల సమయం ముగిసిన తర్వాత వారి గ్రామాల్లో వదిలిపెట్టేందుకు బస్సు డ్రైవర్ బయలుదేరాడు. ధరూర్ మండలం గార్లపాడు విద్యార్థులను వదిలే క్రమంలో గద్వాల శివారు గోనుపాడు స్టేజీ మీదుగా వెళ్తున్న డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా నడపుతూ గొర్రెల మందపైకి తీసుకెళ్తుండగా అదుపు తప్పింది. అదృష్టవశాత్తు బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. డ్రైవర్ నిర్వాకాన్ని గమనించిన గోనుపాడు గ్రామస్థులు డ్రైవర్‌ను దింపి బస్సును అక్కడే నిలిపివేశారు. ఆ సమయం లో డ్రైవర్ మత్తులో ఉన్నట్టు అనుమానించి పోలీసులకు, పాఠశాల యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. పాఠశాల యాజమాన్యం ప్రత్యామ్నాయ డ్రైవర్‌ను పంపి విద్యార్థులను వారి గమ్యస్థానాలకు చేర్చారు. ఈ విషయమై పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెగ్యులర్ గా వచ్చే డ్రైవర్ సెలవులో ఉండటంతో ఆటో డ్రైవర్‌ను పంపామని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఈ ఘటన పై జిల్లా రవాణా శాఖాధికారి టి వెంకటరమణకు ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, ఇలాంటి వాటిపై బస్సులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఫార్మా కాలుష్యం

- పంట పొలాల్లోకి వ్యర్థ జలాలు
- సాగుకు పనికి రాకుండా పోతున్న భూములు
- ఉన్నతాధికారులకు పలుమార్లు రైతుల ఫిర్యాదు
- తనిఖీలకు అనుమతించని యాజమాన్యాలు


జడ్చర్ల మండలం పోలేపల్లిసెజ్‌లోని ఓ పరిశ్రమలో స్టోర్ చేసిన వ్యర్థజలాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం (ఫైల్)

జడ్చర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు నెలకొల్పడంతో తమ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం, యువతకు ఉపాధి లభిస్తుందని స్థానికులు ఆశించారు. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. సదరు ఫార్మా పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం చుట్టు పక్కల పొలాలను నాశనం చేస్తున్నాయి. వ్యర్థ జలాలను పొలాల్లోకి వదులుతుండటంతో పంటలు పండే పరిస్థితి లేకుండా పోయింది. భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సమీపంలో ఈ పరిస్థితి నెలకొన్నది. ఇక్కడ దాదాపు 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సెజ్‌లో పలు ఫార్మ పరిశ్రమలు కొనసాగుతున్నాయి.

కలుషితమవుతున్న భూగర్భ జలం

ఫార్మా పరిశ్రమల నుంచి ప్రత్యేకంగా పైపు లైన్లు ఏర్పాటు చేసి పంటపొలాల్లోకి కలుషిత నీటిని వదులుతున్నారు. కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు వ్యర్థ జలాలను నిల్వ చేసి, వర్షాలు వచ్చినప్పుడు ఆ నీటితో పాటు వ్యర్థ జలాలను పొలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండ్లగడ్డతండా సమీపంలోని కుంటలోకి, ముదిరెడ్డిపల్లి సమీపంలోని చెరువులోకి ఈ నీరు చేరడంతో అవి పూర్తిగా కలుషితమయ్యాయి. దీంతో చెరువులోని చేపలు చనిపోయిన సంఘటనలున్నాయి. భూగర్భ జలం కూడా కలుషితం కావడంతో తండాల్లోని బోర్లలో నుంచి వచ్చే నీటిని సైతం ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై పోలేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుండ్లగడ్డతండా, రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి, రాయపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. ఫార్మా కాలుష్యం నుంచి తమకు విముక్తి కల్పించాలంటూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఎన్నో పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చారు. కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌ను సైతం ఆశ్రయించారు. అయినా పరిస్థితి మారడం లేదు.

సహకరించని యాజమాన్యాలు

ఫార్మా పరిశ్రమలలో తనిఖీలకు వచ్చిన అధికారులకు ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సహకరించడం లేదు. పరిశ్రమలోకి వారిని అనుమతించని సంఘటనలు కూడా ఉన్నాయి. కాలుష్యంతో పంటలు దెబ్బతిన్నాయని, అందుకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాయపల్లికి చెందిన గణేష్‌గౌడ్, పోలేపల్లికి చెందిన రఘునందన్‌గౌడ్‌లు కలెక్టర్ విజయేందిరబోయికి విజ్ఞప్తి చేశారు. ఫార్మా పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. గత నెలలో బృందం సభ్యులు సెజ్‌లోని హెటెరో, అరబిందో ఫార్మా పరిశ్రమల్లో క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లారు. బృందంలోని కొందరిని యాజమాన్యాలు పరిశ్రమలలోకి అనుమతించలేదు. ఆమ్నీల్ పరిశ్రమ వద్ద కూడా అధికారులకు ఇదే అనుభవం ఎదురయ్యింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హిందూ చైతన్యం కోసం కృషి

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- మార్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే విజయుడు


ఎమ్మెల్యే రాజాసింగ్‌తో స్థానిక ఎమ్మెల్యే విజయుడు చిట్‌చాట్

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : హిందువులను చైతన్య పరచడం కోసం కృషి చేయనున్నట్లు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బంధు మిత్రులు, అనుచరులతో కలిసి శ్రీశైలం, మహానంది పుణ్యక్షేత్రాలను సందర్శించుకున్న ఆయన తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉండవల్లి మండలం, పుల్లూరు శివారులోని జాతీయరహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఉన్న లేపాక్షి రెస్టారెంట్‌లో కొద్దిసేపు సేద తీరారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానిక ఎమ్మెల్యే విజయుడు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడుకున్నారు. స్థానిక రాజకీయాలపై అడిగి తెలుసుకున్నారు. 'బీజేపీకి రాజీనామా చేశారు కదా.. భవిష్యత్ కార్యచరణ ఏమిటి?' అని 'ఆంధ్రజ్యోతి' అడిగిన ప్రశ్నకు రాజాసింగ్ స్పందించారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అనుక్షణం ఆలోచించాను కానీ, పార్టీలో అందుకు బిన్నంగా జరగడం బాధ అనిపించి రాజీనామా చేశానని చెప్పారు. రాజకీయాలు తనకు శాశ్వతం కాదని తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో హిందూ చైతన్య యాత్రలు చేపట్టాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. అనుచరులతో చర్చించాక వివరాలు వెల్లడిస్తానన్నారు. ఈ సందర్భంగా స్థానికులు, హిందూ సంఘాల నాయకులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. అంతకు ముందు సినీ హీరో నారా రోహిత్ కూడా అక్కడ సందడి చేశారు.

విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సిద్ధం

- లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రాజేందర్
- హాస్టల్‌ను పరిశీలించిన కౌన్సిల్ బృందం


విద్యార్థులతో మాట్లాడుతున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రాజేందర్

గద్వాల టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రాజేందర్ అన్నారు. బృందం సభ్యులతో కలిసి సోమవారం గద్వాల పట్టణంలోని భీమ్‌నగర్ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపణలు వచ్చినందున తనిఖీ చేసినట్లు తెలిపారు. భోజనం నాణ్యతగా లేదని, సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయని, మెనూ అమలు చేయడం లేదని విద్యార్థినులు అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం మాట్లాడిన కౌన్సిల్ సభ్యులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందజేస్తున్న ఉచిత న్యాయ సేవలపై వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బృందం సభ్యులు బి.శ్రీనివాసులు, టి.లక్ష్మణస్వామి ఉన్నారు.

రావి, వేప చెట్లకు కల్యాణం

ఊరంతా సంబురం

- తలంబ్రాలు పోసుకున్న వృద్ధ దంపతులు
- చెన్నిపాడు గ్రామంలో వైభవంగా వేడుక


రావివేప చెట్లకు హారతి ఇస్తున్న దంపతులు.

మానవపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఊరి జనమంతా ఏకమయ్యారు.. ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. మెట్టినింట ఉన్న ఆడపడుచులను పిలిపించుకున్నారు. రచ్చబండపై నున్న రావి, వేప చెట్లకు వివాహాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామం వేదికగా నిలిచింది. రావి చెట్టును విష్ణువు స్వరూపంగా, వేప చెట్టును లక్ష్మీదేవతగా ప్రజలు భావిస్తారు. ఈ రెండు చెట్లకు కల్యాణం చేస్తే గ్రామానికి మంచి జరుగుతుందని వారి విశ్వాసం. ఈ వివాహానికి వారం రోజుల పాటు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఊరిలో దండోరా వేయించి ప్రజలందరినీ ఆహ్వానించారు. వారం రోజులుగా పెళ్లి ఏర్పాట్లలాగే గ్రామంలోని ప్రజలు దండోరా వేయించి చెప్పారు. మెట్టినింటికి వెళ్లిన తమ ఆడపడుచులకు ఆహ్వానాలు పలికారు. గ్రామంలోని రవీంద్రనాథ్‌కాలనీలోని వాల్మీకి రచ్చకట్టపై ఉన్న రావి, వేప చెట్లను మూడు రోజులు ముందుగానే విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. వృక్షాల ముందు కళ్లాపి చల్లి రంగులతో ముగ్గులు వేశారు. పూలమాలలతో అలంకరించారు. సోమవారం ఉదయం పురోహితుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆ రెండు వృక్షాలకు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఆదర్శదంపతులను పెళ్లి పీటల మీద కూర్చోబెట్టడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కొరగడ్డి భీమన్న, రాములమ్మలను వధూవరులుగా ముస్తాబు చేసి పీటల మీద కూర్చోబెట్టారు. ఎనిమిది పదుల వయసులో వారికి తలంబ్రాలు పోయించి, అగ్ని సాక్షిగా వివాహం జరిపించారు. అనంతరం గ్రామస్థులందరూ వారి ఆశీర్వచనం తీసుకున్నారు. వారితో పాటు గ్రామానికి చెందిన వెంకటపతి, వెంకటేశ్వరి దంపతులు కూడా పెళ్లి పీటలపై కూర్చున్నారు. అనంతరం రెండు జంటలతో గ్రామస్థులు ఊరేగింపు నిర్వహించారు.

హత్య కేసులో నేరస్థుడికి పదేళ్ల జైలు శిక్ష

- పదివేల జరిమానా
- ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నేరస్థుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్ 5వ తేదీన నారాయణపేట ప్రభుత్వ అసుపత్రి వెనుక భాగంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హతుడిని దాసరి మారుతి (39)గా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. సంఘటనపై సోదరుడు దాసరి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి వివరాలు తెలుసుకున్నారు. మారుతి హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ, అప్పుడప్పుడు నారాయణపేటకు వస్తుండేవాడు. అలాగే గత ఏడాది ఏప్రిల్ 5న పేటకు వచ్చిన మారుతి మద్యం తాగేందుకు వెళ్లాడు. అదే సమయంలో ఉప్పరి నర్సింహులు అలియాస్ నజీర్ కూడా అక్కడే మందు తాగుతుండగా, వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న నజీర్, మద్యం మత్తులో వెళ్తున్న మారుతిపై అసుపత్రి వెనుక దాడి చేసి, బండరాయితో కొట్టి చంపేశాడు. మృతదేహంపై కాగితాలు, చెత్త వేసి కాల్చివేసినట్లు పోలీసు విచారణలో వెల్లడయ్యింది. ఈ మేరకు వారు కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. లైజనింగ్ అధికారి సురేందర్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, సీడీవో సురేశ్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్‌రావు కోర్టులో వాదనలు వినిపించారు. నర్సింహులుపై నేరం రుజువు కావడంతో అతడికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ సోమవారం మహబుబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ ట్రయల్ న్యాయాధికారి శారదా దేవి తీర్పు వెల్లడించారు. నేరస్థుడికి శిక్ష పడేలా విచారణ నిర్వహించిన, డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పీపీ రాజేశ్వర్‌రావు, సురేందర్‌గౌడ్, సురేశ్‌కుమార్, విజయకుమార్‌లను ఎస్పీ అభినందించారు. త్వరలో రివార్డులు అందిస్తామని తెలిపారు.

ముగిసిన బీఈడీ అధ్యాపకుల శిక్షణ



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బీఈడీ అధ్యాపకులకు ఏడు రోజులుగా కొనసాగుతున్న శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ ప్రొఫెసర్ జీఎస్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు విశ్వవిద్యాలయాల ఒప్పందంతో కళాశాలలు లాభపడుతాయన్నారు. పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యారంగంలో చదువుపై మాత్రమే కాకుండా భావోద్వేగం, మానసిక శ్రేయస్సుపై దృష్టి పెట్టడం అవసరమన్నారు. ఒప్పందం కుదుర్చుకునేందుకు కృషి చేసిన బోర్డ్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ సునితకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా బీఈడీ అధ్యాపకులకు నిబద్ధత, అంకితభావం, నైపుణ్యం మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, అధ్యాపకులు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పొలం కంచె తొలగింపు

నవాబ్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇతరుల భూమి చుట్టూ వేసిన కంచెను తొలగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండల పరిధిలోని చౌడుర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ విక్రం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చౌడూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 340, 341లో సుంకరి విద్యావతి అనే మహిళకు 8 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలంలోని కోకాపేట గ్రామానికి చెందిన దాసరి సుశాల ఈ ఏడాది జూన్ 11న కొనుగోలు చేసింది. వ్యవసాయానికి అనుకూలంగా చదును చేయించి, చుట్టూ రాతి కడీలు పాతించి, కంచె వేయించింది. ఈనెల మూడున శ్రీను, చంద్రయ్య, శ్రీను, రాజు, మధు, కృష్ణయ్యలు ఆ భూమిలోకి అక్రమంగా ప్రవేశించారు. రాతి కడ్డీలను ధ్వంసం చేసి, కంచెను ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా ఆ భూమిలో ఉలువ పంట కూడా వేశారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కొల్లాపూర్ విద్యార్థులు


కొల్లాపూర్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న శంకర్‌గౌడ్

కొల్లాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఎల్లయ్య ఇద్దరు కుమార్తెలు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యోగా పోటీల్లో విద్యార్థినులు హరిహర కృష్ణ ప్రియ ప్రథమ, అంజలి ప్రియ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా సోమవారం వారిని తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పతంజలి శంకర్ గౌడ్ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్, అధ్యాపకుడు మహబూబ్, శ్రీనివాసులు, సుధీర్, యోగా శిక్షకుడు ఎల్లయ్య, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

సవతి తల్లిపై కుమారుడి దాడి

శ్రీరంగాపురం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన వ్యక్తి సవతి తల్లిపై దాడి చేశాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండల పరిధిలోని నాగరాల కేంద్రం -1లో జరిగింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శేఖర్ మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. సవతి తల్లి చెన్నమ్మతో తరుచూ గొడవ పడుతుండేవాడు. అలాగే సోమవారం అతడు మద్యం మత్తులో తల్లి తలపై రాయితో మోదడంతో రక్తస్రావమైంది. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

న్యూస్ బాక్స్

'పోరాటాలతోనే సాగునీరు'

పాలమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని భూములకు సాగునీటిని పోరాటంతో సాధించగలమని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళ, బుధవారాల్లో జడ్చర్లలో నిర్వహించే సీపీఐ 23వ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చోరీకి గురైన ఫోన్ అప్పగింత

మిడ్జిల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మసిగుండ్లపల్లికి చెందిన గణేష్ మొబైల్ పోవడంతో జూలై 7వ తేదీన మిడ్జిల్ ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ కానిస్టేబుల్ రవి కుమార్ ఆమన్‌గల్లులో ఉన్న మొబైల్‌ను తెప్పించి సోమవారం బాధితుడికి హెడ్ కానిస్టేబుల్ నారాయణరెడ్డి అందజేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గండీడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంఈవో జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం సల్కర్‌పేట్ గిరిజన మినీ గురుకులంలో భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ రాగిని పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

గండీడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో పీఆర్టీయూ సిద్ధంగా ఉంటుందని మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డిపల్లి, లింగాయపల్లి, జక్లపల్లి, జిన్నారం, సాలర్‌నగర్, చిన్న వార్వల్, పెద్ద వార్వల్, రుసుంపల్లి, ఆశిరెడ్డిపల్లి, గండీడ్, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దేవరకద్ర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చంద్రమౌళి అన్నారు. సోమవారం మండలంలోని బల్సుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు, ఈవో నీల్యానాయక్ పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణానికి రూ.175 కోట్లు మంజూరు

జడ్చర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించే షెడ్ నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ది డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఈ నెల 2న ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్‌లో గాల్వాలూమ్ షీట్ రూఫింగ్‌తో కూడిన కవర్డ్‌షెడ్ నిర్మాణం చేపట్టేందుకు ఈ నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కృషితోనే నిధులు మంజూరైనట్లు బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పాలమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిష్టారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలకు మద్దతు తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గండీడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వెన్నాచేడ్ గ్రామాల్లోని గ్రంథాలయాల్లో పుస్తకాలతో పాటు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, గ్రంథాలయ అకౌంటెంట్ మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మూసాపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన వడ్ల సాంబయ్య పది రోజుల క్రితం మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబాన్ని బీజేపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు రమేష్ పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు శంకర్, మల్లేష్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నవాబ్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం వేగవంతంగా ఉండాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాయలంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, టీఏలతో వారాంతపు సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వందశాతం వన మహోత్సవం పూర్తి చేయాలన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్, లారీ ఢీ

జడ్చర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ప్రైవేట్ ట్రావెల్స్, లారీ ఢీ కొన్నాయి. ఫర్టిలైజర్స్ లోడుతో జడ్చర్ల మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మెనూ తప్పక పాటించాలి

» కలెక్టర్ విజయేందిర బోయి



విద్యార్థులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

మూసాపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఇదే ఊర్లో ఉంటారా? ఎక్కడ ఉంటాడని వసతిగృహ సిబ్బంది, అధికారులను అడిగారు. వంటగదిని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మొత్తం 94 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికీ 36 ఇళ్లు గ్రౌండింగ్ చేయగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతిలో వచ్చిన భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? క్షేత్రస్థాయిలో దరఖాస్తులను విచారించారా? వాటి ప్రగతి నివేదికలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో అనురాధ, ఏపీవో పులేందర్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్ : ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 96 ఫిర్యాదులు రాగా, కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, ఏనుగు నర్సింహరెడ్డి, ఆర్డీవో నవీన్, జెడ్పీ సీఈవో వెంకటరెడ్డి, హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్ పాల్గొన్నారు. అంతకుముందు ఈ నెల 11న నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నులి పురుగుల నివారణకు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. డీఎంహెచ్‌వో కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 9 సంవత్సరాల లోపు పిల్లలు 2,54,000 మంది ఉన్నారని, వారికి మాత్రలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని తెలిపారు. డాక్టర్ విద్య, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి జరీనాబేగం, హెల్త్ ఎడ్యుకేటర్ రాజగోపాలచారి, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సుభాష్ చంద్ర, చక్రపాణి, రమేష్, రాధ పాల్గొన్నారు.

అభ్యంతరాలపై పరిశీలన



ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కానీ ఉపాధ్యాయులు కొంత మంది సోమవారం కూడా సర్వీస్ రికార్డులు, ధ్రువపత్రాల పరిశీలన చేశారు. ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, సమస్యలు ఉంటే పరిష్కరించి జాబితాలో ఏమైన తప్పులు జారిగాయా? అన్న దానిపై క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో మాదిరిగా ఎలాంటి తప్పులు జరగకుండా అధికారులు, కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భాషా పండితులకు సంబంధించి గతంలో ఇచ్చిన పదోన్నతుల్లో కొన్ని తప్పులు దొర్లడంతో అప్పట్లో కొంత మంది భాషా పండితులకు అన్యాయం జరిగింది. మళ్లీ అలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ కోటాలో పదోన్నతులకు అడిక్వసి (ఆ పోస్టులకు సరిపడా) కేటగిరిలో పదోన్నతుల పొందే ఉపాధ్యాయులు ఉన్నారా? లేదా అన్న దానిపై అధికారులు, సిబ్బంది, కమిటీ సభ్యులు పూర్తిస్థాయి కసరత్తు చేశారు. జీహెచ్ఎంలుగా పదోన్నతులు పొందే స్కూల్ అసిస్టెంట్స్ వివరాలను ఇప్పటికే ఆర్జేడీకి పంపించినట్లు అధికారులు తెలిపారు. వీరి పదోన్నతుల సీనియార్టీ జాబితా మంగళవారం ఆన్‌లైన్‌లో పొందుపరిచిన అనంతరం జోన్-2లోని ఖాళీల ఆధారంగా ఉన్న ఖాళీలో తమకు కావల్సిన పాఠశాలకు వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకుంటారు. ఆ తర్వాత వారికి ప్లేసులు కేటాయిస్తారు. అనంతరం ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ప్రక్రియ జిల్లా కేంద్రం డీఈవో ఆధ్వర్యంలో జరగనుంది. అదే విధంగా భాషా పండితుల, పీఈటీ అప్‌గ్రెడేషన్ నిర్వహిస్తారు.

రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తోందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఇందుకోసం ఈనెల 5 6, 7వ తేదీల్లో కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, సీనియర్ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 42శాతం బీసీ రిజర్వేషన్లు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడంతో పాటు తెలంగాణ అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపించిందన్నారు. కేంద్రం ఈ అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 34 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వగా, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 23 శాతానికి తగ్గించారని ఆ నష్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భర్తీ చేసేందుకు అంకితభావంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. బీసీలకు 42 శాతం ఇస్తే అందులో ముస్లింలకే 10 శాతం పోతాయని బీజేపీ మాట్లాడటం దురదృష్టకరం అన్నారు. ముస్లిం జనాభా పట్టణాల్లో తప్ప గ్రామాలు, మండలాల్లో తక్కువగా ఉందన్నారు. ప్రజల మధ్య గందరగోళం సృష్టించేందుకు బీజేపీ అర్థం లేని వ్యాఖ్యలు చేస్తోందన్నారు. నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, బాలస్వామి, నారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/దేవరకద్ర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పూటకో మాట మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందని, దాన్ని ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిర్వహించాల్సిన కార్యక్రమంపై పార్టీ ముఖ్యనాయకుల సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హామీలు అమలు చేయడంతో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోందన్నారు. గత బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ముందు సాగుతోందని, ఈ రెండు పార్టీలు ప్రజలను నమ్మించి మోసం చేశాయని మండిపడ్డారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు ఆ దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, నాయకులు బాల్‌రాజ్, పాండురంగారెడ్డి, రమేష్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా దేవరకద్ర మండలం గురుకొండలో బీజేపీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జడ్చర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి పాతబజారు సమీపంలోని పెద్దగుట్టపై వెలిసిన రంగనాయక స్వామి ఆలయంలో సోమవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

● భూత్పూర్ : శ్రావణ రెండో సోమవారం సందర్భంగా మునిసిపాలిటీలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకుడు గోప్లాపూర్ సత్యనారాయణ దంపతులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మంజునాథస్వామి పాల్గొన్నారు.

బీజేపీలోకి మాజీ సర్పంచులు

గండీడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు మాజీ సర్పంచులు బీజేపీలో చేరుతున్నారని వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రంగారెడ్డిపల్లి మాజీ సర్పంచు ఎరుకలి రాములు, గోవిందుపల్లి మాజీ ఉప సర్పంచు కుర్మయ్య బీజేపీలో చేరారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర నాయకుడు గిరిమోని శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు శంకర్‌నాయక్, మల్లయ్య, ప్రభునాయక్, రాజు, మహిపాల్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నేతాజీ యువజన సంఘం భవనానికి భూమి పూజ

భూత్పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని అమిస్తాపూర్‌లో ఎంపీ నిధుల ద్వారా నేతాజీ శుభాష్ చంద్రబోస్ యువజన సంఘం భవన నిర్మాణానికి గ్రామ యువకులు సోమవారం భూమి పూజ చేశారు. యువకులు కెంద్యాల శ్రీనివాసులు, నర్సిములు ముదిరాజ్, ఫారుక్, గాల్‌రెడ్డి, గూటం శ్రీనివాసులు, పవన్‌కుమార్, నరేందర్, నరేందర్ గౌడ్, మహానంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి

కోయిలకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని రూరల్ సీఐ గాంధీనాయక్ పేర్కొన్నారు. సోమవారం కోయిలకొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మండలంలో నెల రోజులుగా వచ్చిన ఫిర్యాదులు, ఇతర నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ తిరుపాజీ, హెడ్ కానిస్టేబుల్ రవి, సిబ్బంది శ్రీహరి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

స్వామివారికి లక్ష బిల్వార్చన

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీనివాస కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం స్ఫటిక లింగేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి జలాభిషేకం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీనివాస కాలనీలోని భక్తులతో పాటు, సమీప కాలనీల నుంచి భక్తులు అధిక సంఖ్యలోని పాల్గొని స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజనరసింహ్మా, కమిటీ సభ్యులు, వాసవి మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు ఆళ్ల భూపాల్‌రెడ్డి, తానెం సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని కారూర్, కూచూర్ గ్రామాలకు చెందిన చంద్రయ్య, యువకులు శ్రీనివాస్, మహేష్, రమేష్, రవితో పాటు దాదాపు 20 మంది పార్టీలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరగా, ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు నిర్వాసితులకు అండగా నిలిచిందన్నారు. మాజీ ఉప సర్పంచ్ నర్సింహులుగౌడ్, అనుద్, మల్లయ్య, వెంకటయ్య, మల్లేష్, పాల్గొన్నారు.

● చిన్నచింతకుంట : మండలంలోని అమ్మాపూర్‌కు చెందిన బీజేపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ జెట్టెం మహేష్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన శ్రీను, గణేష్, బీఆర్ఎస్ నాయకులు వాసురెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ భాస్కర్ ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్ర స్థాయికి వస్తాం : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని ఎస్పీ జానకి పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తమ సిబ్బంది క్షేత్ర స్థాయికి వస్తారన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదులను పురస్కరించుకుని ఎస్పీ తన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌లలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. గ్రీవెన్స్ డే అనేది ప్రజలు నేరుగా ఉన్నతాధికారులకు తమ సమస్యలు చెప్పుకునే వేదికగా మారుతుందని, ఇక్కడ వచ్చిన అన్ని ఫిర్యాదులను నిశితంగా గమనించాలన్నారు. ఎక్కడైనా గొడవలు జరిగే అవకాశం ఉంటే ముందస్తుగానే వాటి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చాయి.

బాధ్యతగా పని చేయాలి

హన్వాడ : పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం కలగాలంటే ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవరించాలని ఎస్పీ జానకి పేర్కొన్నారు. సోమవారం హన్వాడ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి, ఫిర్యాదు రిజిస్టర్, కేసుల పురోగతి దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు, ఆయుధాల భద్రత రికార్డులను పరిశీలించారు. మహిళా భద్రత, రాత్రి గస్తీని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎస్‌ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి



సరోజ్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

భూత్పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : యువత రాజకీయాల్లో రాణించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ బస్వ రాజుగౌడ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ దేవరకద్ర నియోజవర్గ యువజన నాయకుడు మందడి సరోజ్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో సరోజ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సరోజ్‌రెడ్డి ఫాంహౌజ్‌లో రక్తదానం, అన్నదానం చేశారు. బీఆర్ఎస్ నాయకులు మురళీధర్‌గౌడ్, నారాయణగౌడ్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అంజనేయులు, దశరత్‌నాయక్, రమేష్‌చందర్, రామునాయక్, బాల్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు

యూరియా సమస్య లేకుండా చూడాలి

పాలమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రైతులకు యూరియా సమస్య లేకుండా పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంతో రైతులు జోరుగా వరి నాట్లు వేస్తున్నారని, ఈ క్రమంలో ఎరువు కొరత లేకుండా యూరియా సరఫరా చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, మోహన్, చంద్రకాంత్, వేణుగోపాల్, రాజ్, జగన్, నరసింహులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

జడ్చర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకొచ్చిన జీవో నెంబరు 282ను రద్దు చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన సానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గాన్ని బానిసత్వానికి గురిచేసే విధంగా పని గంటలను 10కి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన జీవోను తీసుకొచ్చిందని ఆరోపించారు. వెంటనే పని గంటల పెంపు నిర్ణయంను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు నరసింహ, నవీన్, మణెమ్మ, పద్మ, సుక్కమ్మ, అంజలి, భార్గవి, నీరజ, మంగమ్మ, అలివేల, లక్ష్మి, నరసమ్మ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని సరోజిని రాములమ్మ ఫార్మసీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీర్, ప్రథమ చికిత్సలపై అవగాహన సదస్సును నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాదవశాత్తు గాయాలై రక్తం కారితే ఏం చేయాలి, దెబ్బలు తగిలి ఫ్రాక్చర్స్ అయితే ఎలాంటి చికిత్సలు చేయాలి, పాముకాటుకు గురైనపుడు ఏం చేయాలి, అపస్మారక స్థితికి గురైనప్పుడు సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల చైర్మన్ బాలరాజు, రెడ్‌క్రాస్ యూత్ కోఆర్డినేటర్ బాబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజీలాల్, హెచ్‌వోడీ డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయపాల్‌రెడ్డి

పాలమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా కేంద్రానికి చెందిన మున్నూరు జయపాల్‌రెడ్డి నియామకమయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా కొండా కొండా పురుషోత్తంరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో వినోద్, రమేష్, శ్రీనివాసులు, ఇమ్మడి పురుషోత్తం, బండి శివరామిరెడ్డి, సత్యరఘుపాల్‌రెడ్డి, గల్లా రవికుమార్, కమటం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటేనే నేటి పోటీ ప్రపంచంలో రాణిస్తారని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.కృష్ణ మూర్తి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడామిక్ ఫర్‌స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్ మిలియన్.. వన్ బిలియన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వన్ మిలియన్ ..వన్ బిలియన్ కార్యక్రమ ప్రతినిధులు శ్వేత, విఠల్, కార్తీకేయ, డాక్టర్ సాయి కృష్ణ ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్‌కుమార్, దివ్యతేజ, సయ్యద్ ముస్తాఖా పాల్గొన్నారు.

స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్‌కు కోడ్గల్ విద్యార్థులు

జడ్చర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్ శిక్షణకు జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు సోమవారం వివరాలు వెల్లడించారు. పాఠశాలలోని 6 మంది 10వ తరగతి విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) మరియు డైటా సైన్స్ కోర్సులో 8 వారాలు పాటు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందుతారని తెలిపారు. ప్రతీ వారం వీడియోలు, లైవ్ ఇంటరాక్టివ్ సెషన్‌లు, అసైన్‌మెంట్‌లు, కంప్యూటర్ ఆధారిత పరీక్షలతో విద్యార్థులు శిక్షణ పొందుతారని వివరించారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు అధికార ధ్రువపత్రం జారీ చేస్తారన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మాధవి

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆసుపత్రిలోని ఎంసీహెచ్ భవనంలో సోమవారం తల్లిపాల ప్రాముఖ్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓబీజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆశాజ్యోతి, పిడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజిత్‌కుమార్, సీడీపీవో రాధిక, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ప్రేరణ పాల్గొన్నారు.